సాక్షి సూర్యాపేట
ఆదివారం । 17 । ఆగస్టు । 2025



ఇద్దరు దొంగల అరెస్టు

సూర్యాపేటలో జూలై 21 రాత్రి జరిగిన భారీ దొంగతనం కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. - 8లో



నిర్లక్ష్యమే కారణమని..

తన భార్య మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి భర్త, కుటుంబీకులు ఆందోళనకు దిగారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	587.50 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,99,544 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1,95,450 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	28,217 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	6,006 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	2,067 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

నేడు, రేపు మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డి ఆది, సోమవారం రెండు రోజుల పాటు హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పాలకవీడు మండలం రాఘవాపురంలో, సాయంత్రం 4:15 గంటలకు హుజూర్‌నగర్ శివారులోని మగ్దుం నగర్‌లో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తారు. అనంతరం 5 గంటలకు హుజూర్‌నగర్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. 6 గంటలకు పట్టణంలోని మంత్రి తన ఇంటికి చేరుకుని రాత్రి బస చేస్తారు. సోమవారం ఉదయం 8:40 గంటలకు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సిటీ స్కాన్, డయాలసిస్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించి, నూతన ఓపీ బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఎన్ఎస్పీ క్యాంప్‌లో నీటిపారుదల శాఖ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులను మంత్రి ప్రారంభిస్తారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తారు. అనంతరం మంత్రి కోదాడకు వెళతారు.

సీఎం, మంత్రులందరిదీ కమీషన్ పాలనే..



మాట్లాడుతున్న ఒంటెద్దు నరసింహారెడ్డి

మఠంపల్లి: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డితో సహా మంత్రులందరిదీ కమీషన్ పాలనేనని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, హుజూర్‌నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఒంటెద్దు నరసింహారెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన మఠంపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తమ సొంత నియోజకవర్గాల్లో రుణమాఫీ, రైతు భరోసా వందశాతం పూర్తిచేసినట్టు నిరూపించాలన్నారు. గతంలో ఎత్తిపోతల పథకాలను అడ్డుకున్న మంత్రి ఉత్తమ్ ఇప్పుడు పూర్తిచేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంత ప్రేమ ఉందో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే తెలిసిపోతుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, మాజీ జెడ్పీటీసీ జగన్‌నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహరాజు, నాయకులు బీవీ రామారావు, హఫీజ్‌ఖాన్, పుల్లారెడ్డి, బాలాజీనాయక్, లక్ష్మీనరసింహారెడ్డి, సైదులు, కోటానాయక్, జాలకిరణ్, నాగయ్యయాదవ్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

• జయకృష్ణా.. ముకుందా.. మురారి



శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం కోదాడ పట్టణంలోని చిన్నారి ప్లే స్కూల్‌లో ఉట్టిని కొడుతున్న చిన్నారులు - కోదాడ



మునగాల మండల కేంద్రంలో ఉట్టి కొడుతున్న యాదవ సంఘం సభ్యులు - మునగాల

సర్కారు కార్యాలయాలకు సౌర వెలుగులు

- ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం
- ఇప్పటికే కలెక్టరేట్‌లో వినియోగం
- తప్పనున్న బిల్లుల భారం
- వివరాలు సేకరిస్తున్న టీజీ రెడ్కో అధికారులు



భానుపురి (సూర్యాపేట) : జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు సౌర విద్యుత్ వెలుగులు రానున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యుత్ ఆదా చేయడంతోపాటు ఆయా శాఖలకు భారంగా మారుతున్న విద్యుత్ బిల్లుల చెల్లింపుపై ఊరట కలగనుంది. ఈ క్రమంలో తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) అధికారులు వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సౌర విద్యుత్‌ను వినియోగిస్తున్నారు.

ప్లాంట్ల ఏర్పాటుకు వివరాల సేకరణ

పక్కాగా భవనాలు ఉన్న కార్యాలయాల్లో ఈ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే పక్కాగా భవనాలు ఉన్న కార్యాలయాల వివరాలను టీజీ రెడ్కో అధికారులు సేకరిస్తున్నారు. ఏ భవనం ఎంత విస్తీర్ణంలో ఉంది..? అక్కడ ఎంత విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉన్నాయన్న వివరాలను మండల స్థాయి నుంచి సేకరిస్తున్నారు. ప్రధానంగా గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాల భవనాలు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సాగునీటి ప్రాజెక్టుల కార్యాలయాలు.. ఇలా ప్రతి ప్రభుత్వ కార్యాలయంపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

విద్యుత్ వినియోగం ఆధారంగా..

పక్కాగా భవనాలు కలిగిన ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రస్తుతం నెలకు ఎంత విద్యుత్ వినియోగం జరుగుతోంది? ఎంత విద్యుత్ బిల్లు వస్తోందన్న వివరాలను సైతం అధికారులు సేకరిస్తున్నారు. ఈ లెక్కన తక్కువ విద్యుత్ వినియోగం ఉన్న కార్యాలయాలకు ఎల్టీ సర్వీస్ కింద, విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్న భవనాలకు హెచ్‌టీ సర్వీస్ కింద సోలార్ ప్లాంట్లను బిగించనున్నారు. రూ.2 వేల నుంచి రూ.3 వేల కరెంట్ బిల్లులు వచ్చే కార్యాలయాలకు ఎల్టీ సర్వీస్ కింద మూడు నుంచి ఐదు కిలోవాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే విశాలమైన భవనాలతో ఎక్కువ విద్యుత్ వినియోగించే వాటికి హెచ్‌టీ సర్వీస్ కింద 100 కిలోవాట్లకుపైగా సోలార్ ప్లాంట్లను బిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండలాల వారీగా వివరాలు సేకరిస్తున్న అధికారులు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు. ప్రభుత్వం ఆమోదించి బడ్జెట్ కేటాయిస్తే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే అవకాశముంటుంది.

ప్రభుత్వానికి నివేదిక పంపుతాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పక్క భవనాలు ఉన్నాయి. ఈ భవనాలపై సౌర విద్యుత్ ప్లాంట్లను ఎంత మేర ఏర్పాటు చేసే అవకాశం ఉందన్న వివరాలు సేకరిస్తున్నాం. ఇంకా మండలాల నుంచి వివరాలు వస్తున్నాయి. వీటన్నింటినీ క్రోడీకరించి త్వరలోనే ప్రభుత్వానికి నివేదిస్తాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకు సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం.

– సంతోష్, టీజీ రెడ్కో జిల్లా మేనేజర్

మట్టపల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో రెండు రోజులపాటు జరగనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం మొదటి రోజు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీకృష్ణుడికి అభిషేకం, అర్చనలు చేశారు. శ్రీకృష్ణుడి జన్మవృత్తాంతం పఠనం గావించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ విధానం రద్దుచేయాలి



నూతన కార్యవర్గ సభ్యులు

సూర్యాపేట అర్బన్ : కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానం రద్దుచేసి వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేటలోని వీఎన్ భవన్‌లో జరిగిన సమావేశంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నెమ్మాది వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా కె.చైతన్య, ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీకాంత్ వర్మ, కోశాధికారిగా ఎస్.రమేష్, ఉపాధ్యక్షుడిగా ఎన్.జానయ్య, సహాయ కార్యదర్శిగా త్రివేణి, పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం నెమ్మాది మాట్లాడారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర ప్రభుత్వం అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శనివారం ఆయన సూర్యాపేట కలెక్టరేట్‌లో పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి, అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి సూర్యాపేట రూరల్, చివ్వెంల మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. చివ్వెంల మండలంలో 1,856 రేషన్ కార్డులు, 526 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు ఇచ్చామన్నారు. అలాగే సూర్యాపేట రూరల్ మండలంలో 1,654 రేషన్ కార్డులు, 740 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశామన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తిచేసుకోవాలని కోరారు. రేషన్ కార్డులు రానివారు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, మీ–సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉంటే మంజూరు చేస్తామన్నారు. పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పేదవారి ఆత్మగౌరవానికి రేషన్ కార్డులు చిహ్నం అని అన్నారు. జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికీ నూతన రేషన్ కార్డులు ఇవ్వడం సంతోషకర విషయమన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, డీఎస్ఓ మోహన్‌బాబు, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, డీఈ జబ్బార్ అహ్మద్, ఏఈ రాంబాబు, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో లబ్ధిదారురాలికి ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తదితరులు

భవితకు పునాది 'బాలబడి'

- అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్య అమలుకు కొత్త కార్యక్రమం
- చిన్నారులను ఆకట్టుకునేలా కరదీపికలు
- ప్రియదర్శిని పేరుతో పాఠ్యపుస్తకాలు



అంగన్‌వాడీ పిల్లలకు పంపిణీ చేసిన పుస్తకం

నాగారం : బుడిబుడి అడుగుల దశలోనే చిన్నారులను బడిబాట పట్టించి వారి ఉజ్వల భవితకు పునాది వేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్) కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను ఆకట్టుకునేలా బాలబడి కార్యక్రమం చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేక పాఠ్య ప్రణాళిక రూపొందించారు. సృజనాత్మకతను పెంచేలా కొత్త సిలబస్‌ను అమలు చేస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్య సజావుగా సాగేలా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కరదీపికలు పంపిణీ చేశారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	05
అంగన్‌వాడీ కేంద్రాలు	1,209
3–6 ఏళ్లలోపు చిన్నారులు	18,066

సులువుగా అర్థమయ్యేలా..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సులభంగా అర్థమయ్యేలా 'ప్రియదర్శిని' పుస్తకాలను ముద్రించి పంపిణీ చేశారు. నూతన పాఠ్యాంశాలు, వినూత్న అంశాలు ఇందులో పొందుపర్చారు. గత విద్యా సంవత్సరంలో 'తంగేడు పువ్వు' పేరుతో నాలుగు పుస్తకాలు పంపిణీ చేయగా ఆశించిన ఫలితాలు రాలేదు. తాజాగా వచ్చిన ప్రియదర్శిని పుస్తకాలతో చిన్నారుల్లో విజ్ఞానం పెరిగే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు అంటున్నారు.

పర్యవేక్షణ పెంచితే సత్ఫలితాలు


ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావడం లేదు. అంగన్‌వాడీలపై పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కేంద్రాలపై పర్యవేక్షణ పెంచి, సిలబస్ ప్రకారం బోధిస్తేనే సత్ఫలితాలు వస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పిల్లల ఉజ్వల భవితే లక్ష్యం

నూతన సిలబస్ చిన్నారుల ఉజ్వల భవితకు బాటలు వేసేందుకు ఉపయోగపడుతుంది. ఆంగ్ల మాధ్యమంలో బోధనతో భాషపై ప్రాథమికంగా పట్టు సాధించేందుకు వీలుంటుంది. కొత్త సిలబస్ ద్వారా లోతైన విజ్ఞానం పొందవచ్చు.

– దయానందరాణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

• కృష్ణమ్మ కాంతులు



విద్యుత్ దీపాల వెలుగులో నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్ల ద్వారా పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

వీడని వరద.. తీరని వ్యథ!



తిరుమలగిరి మండలం తొండలో నీట మునిగిన వరిపొలాలు



సూర్యాపేటలోని ఆర్‌కే నగర్‌లో ఇళ్ల చుట్టూ చేరిన వరద

- అలుగు పోస్తున్న చెరువులు
- సూర్యాపేటలో పలు కాలనీలు జలమయం
- ఇతర మండలాల్లో నీట మునిగిన వరిపొలాలు

సూర్యాపేట అర్బన్ : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలో పలు ప్రాంతాలు ముంపు బారిన పడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో ఇళ్ల చుట్టూ, వరిపొలాల మీదుగా వరదనీరు పారుతోంది. మళ్లీ శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సూర్యాపేట పట్టణంలో సద్దల చెరువు, పిల్లలమర్రి చెరువు అలుగు పోస్తున్నారు. ఆయా చెరువుల వరదంతా పట్టణంలోని ఎస్వీ కాలేజీ వెనుక నుంచి ప్రియాంక నగర్, ఆర్‌కే గార్డెన్ మీదుగా ఎస్పీ ఆఫీస్ దగ్గర గల ఈదులవాగు నుంచి నల్ల చెరువులోకి చేరుతోంది. ఆయా కాలనీలను వరద వదలడం లేదు. ఫలితంగా ఆయా కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలో పలు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరద ముప్పు తప్పేలా శాశ్వత పరిష్కారం చూడాలని స్థానికులు కోరుతున్నారు. తిరుమలగిరి, మోతె, ఇతర మండలాల్లోనూ చెరువులు అలుగు పోస్తూ వరిపొలాలను ముంచెత్తుతున్నాయి.



సూర్యాపేటలో నాలాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి, సిబ్బంది



సూర్యాపేటలోని ఆర్‌కే నగర్‌లో ఇంట్లోకి చేరిన వరదనీరు



మోతె మండలం రావిపహాడ్‌లో వరిపొలంలో నిలిచిన వర్షపునీరు

పొదుపు సంఘాల్లోకి కిశోర బాలికలు

- కొత్తగా దివ్యాంగులు, 60 ఏళ్లు పైబడిన మహిళలకూ అవకాశం
- మార్గదర్శకాలు జారీచేసిన ప్రభుత్వం
- మరింత మందికి చేయూతనిచ్చేలా కార్యాచరణ
- నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో వివరాలు నిక్షిప్తం



సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

స్వయం సహాయక సంఘాలు	మొత్తం సభ్యుల సంఖ్య
17,976	1,84,774

నాగారం : ఇందిరా మహిళా శక్తి మిషన్‌లో భాగంగా చిన్నప్పటి నుంచే డబ్బులు పొదుపు చేయడం, బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పించేందుకు 15–18 ఏళ్ల లోపు కలిగిన కిశోర బాలికలతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీరితోపాటు దివ్యాంగ మహిళలు, 60 ఏళ్లు పైబడిన మహిళలతో కొత్తగా పొదుపు సంఘాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇప్పటికే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు రోజు వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సూచనలు, సలహాలు అందజేశారు. అయితే మహిళా స్వయం సహాయక సంఘాల్లో ఇప్పటి వరకు 18 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు కలిగిన మహిళలకు మాత్రమే సభ్యత్వం ఉంది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దివ్యాంగులు, కిశోర బాలికలతోపాటు అరవై ఏళ్లు దాటి మహిళలకు ఆర్థిక చేయూత లభించే అవకాశం కలిగింది.

ఈ వారంలో సంఘాల ఏర్పాటుకు కసరత్తు

జిల్లాలో ఇప్పటికే 17,976 స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ)లు ఉన్నాయి. మహిళా శక్తి కింద అర్హులైన మహిళందరితో కొత్తగా సంఘాలు ఏర్పాటు చేయడంతోపాటు ఇప్పటికే ఉన్న సంఘాల్లో చేర్పనున్నారు. దీంతో అదనంగా మరిన్ని సంఘాలు ఏర్పాటు కానున్నాయి. దివ్యాంగులు, కిశోర బాలికలు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు అవకాశం కల్పిస్తారు. క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేసింది. ఇటీవలే జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. మండల స్థాయి సదస్సులతో అర్హులను గుర్తిస్తున్నారు. ఈనెల మూడో వారంలో కొత్తగా సంఘాల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న వాటిలో అవకాశం కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈనెల మూడు, నాలుగో వారంలో బ్యాంకు పొదుపు ఖాతాలు తెరిపించనున్నారు. ఈ నెల 30న సంఘాల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసి అనంతరం బ్యాంకు లింకేజీ తదితర రుణాలు మంజూరు చేయనున్నారు.

అర్హులను చేర్పించేలా కార్యాచరణ



ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో అర్హులైన వారందరినీ చేర్పించేలా ఇప్పటికే కార్యాచరణ రూపొందించాం. ఏపీఎం, సీసీలకు అవగాహన కల్పించాం. గ్రామ, పట్టణ స్థాయిలో ప్రతి ఒక్కరికీ సభ్యత్వం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

– వీవీ.అప్పారావు, డీఆర్‌డీఓ, సూర్యాపేట

క్లుప్తంగా

మూసీకి భారీగా వరద

- 8 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల



మూసీ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 8,633 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయిలో ఉండటంతో అధికారులు శనివారం ఎనిమిది క్రస్ట్ గేట్లను రెండు అడుగులు పైకెత్తి దిగువకు 10వేల క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వకు 140 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాలువలకు, గేట్ల ద్వారా, ఆవిరి, సీపేజీ, లీకేజీ రూపంలో ప్రాజెక్టు నుంచి మొత్తం 10,200 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా శనివారం సాయంత్రం వరకు 642.50 అడుగులుగా నీటిమట్టం ఉంది.

సినీ దర్శకుడిగా రాణిస్తున్న నిడమనూరు వాసి

- 'ఫ్రెండ్లీ ఘోస్ట్' సినిమాకు దర్శకత్వం వహించిన మధుసూదన్‌రెడ్డి



ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంచు మనోజ్, గోపు మధుసూదన్‌రెడ్డి

నిడమనూరు: నిడమనూరు మండలం గోపువారిగూడెం గ్రామానికి చెందిన గోపు మధుసూదన్‌రెడ్డి సినీ రంగంలో రాణిస్తున్నారు. ఆయన దర్శకత్వం వహించిన ఫ్రెండ్లీ ఘోస్ట్ సినిమా విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ హీరో మంచు మనోజ్ శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. సుచిన్ సినిమా బ్యానర్‌పై మాస్టర్ జియాన్స్ సమర్పణలో సత్యం రాజేష్, సత్యదేవ్ ప్రధాన పాత్రలుగా ఈ సినిమాను తెరకెక్కించినట్లు మధుసూదన్‌రెడ్డి వివరించారు. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా సాంగ్స్, ట్రైలర్ త్వరలో రాబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



శంకర్ (ఫైల్)

చింతపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం కొక్కిరాల గౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని బొత్యతండాకు చెందిన రామావత్ శంకర్(23) డిగ్రీ చదువుతున్నాడు. బైక్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు శుక్రవారం రాత్రి తమ గ్రామానికి సమీపంలోని వెంకటంపేట వద్ద గల పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా.. కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంకర్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తండ్రి తార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అలరించిన గోపిక, శ్రీకృష్ణులు

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని చిన్నారులను గోపికలు, శ్రీకృష్ణుడిగా అలంకరించి ఫొటోలు తీసి పంపించాలనే 'సాక్షి' ఆహ్వానానికి విశేష స్పందన వచ్చింది. తల్లిదండ్రులు తమ చిన్నారులను అందంగా ముస్తాబు చేసి ఫొటోలు తీసి వాట్సాప్‌లో పంపించారు. వాటిలో కొన్ని..



మామిడి ఆర్యన్ శ్రీవాస్తవ, సూర్యాపేట
మామిడి ప్రజ్ఞ శ్రీ, సూర్యాపేట
కేసిడి శ్రీనిక రెడ్డి, తిరుమలగిరి
నక్షిత్, బేతవోలు, చిలుకూరు
బండ ఆద్విక, తిరుమలగిరి
వేదాంత్, పిల్లలమర్రి
యజ్ఞశ్రీ, తడకమళ్ల, మిర్యాలగూడ
వర్రె లోహిత్, తిరుమలగిరి
కృతిక్ మధ్యుత్, తిరుమలగిరి
వి.అవిక్షిత్, గుమ్మడవెల్లి
రిషిక్ కుంభం, పర్సాయపల్లి
ధ్రువిక్, అద్విక్, భరాఖత్ గూడెం, మునగాల
ఆర్. రుద్వీర్, బేతవోలు
పాదిల రేహాన్ష్‌గౌడ్, పసునూరు, నాగారం
మేఘ, వర్ష, రాయంగూడెం
వర్రె నిహాంత్, తిరుమలగిరి
రితేష్, సూర్యాపేట
భవ్యశ్రీ, మామిళ్లగూడెం
ఆధ్య, కోదాడ
వర్ణిక, తిరుమలగిరి
ఆర్. చిన్ను, సూర్యాపేట
డి.వికన్సీ, సూర్యాపేట
శ్రేయాన్ష్, సూర్యాపేట
గురికరెడ్డి సిరిచందన రెడ్డి, తిరుమలగిరి
చరణ్వి, కుంటపల్లి
రిత్విక్, హుజూర్ నగర్
కృతిక, పరాశర, సూర్యాపేట
కటికం రుహి చనియ, మామిడి సామిక, సూర్యాపేట
బింగి చాణక్య, అర్వపల్లి
నూకల గగన్ రెడ్డి, ఆరాధ్య, గరిడేపల్లి
మన్వ, సూర్యాపేట
కృతిక, సూర్యాపేట
జోశ్విక్, సూర్యాపేట
కశ్విక, సూర్యాపేట
వేదాన్షి, సూర్యాపేట
మన్వ, సూర్యాపేట
బాంధవ్య, నేరేడుచర్ల
ఓంకార్ గౌడ్, సూర్యాపేట
మహి జాన్వి, సూర్యాపేట
సమన్విత, అర్వపల్లి
చాణిక్య, సూర్యానాయక్ తండా
రిత్విక్ నాయక్, సూర్యానాయక్‌తండా
బాదిని నక్షత్ర, సూర్యాపేట
మహంకాళి సౌమ్య శ్రీ, కుంచమర్తి
రిత్విక్ రోహన్, సూర్యాపేట
లాస్యశ్రీ, కోమటికుంట
కనిష్క, కోమటికుంట
సాయి సూరజ్‌పటేల్, సూర్యాపేట
కాంపాటి ప్రభసుధీర్, నర్సింహులగూడెం
కొమ్ము దుర్గా వేదాన్స్, కొమ్ము చరణ్య, తిరుమలగిరి
అద్విక్ విరాజ్, సూర్యాపేట
కాంపాటి విద్యశ్రీ, నర్సింహులగూడెం
కార్తికేయ, హుజూర్ నగర్
అవ్యాన్, సిరిపురం, నడిగూడెం మండలం

వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని..

- ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట మృతురాలి కుటుంబ సభ్యుల ఆందోళన

తుంగతుర్తి: తన భార్య మృతికి ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడే కారణమని ఆరోపిస్తూ మృతురాలి భర్త, కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం గోరంట్ల గ్రామానికి చెందిన భయగళ్ల విజేత(26) కడుపునొప్పితో బాధపడుతూ శుక్రవారం తుంగతుర్తిలోని సాయిబాలాజీ ఆస్పత్రికి వచ్చింది. ఆమెకు ఆస్పత్రి డాక్టర్ శ్రీనివాస్ వైద్యం చేశాడు. అయినప్పటికీ ఆమెకు కడుపునొప్పి తగ్గకపోవడంతో స్వయంగా ఆ డాక్టరే ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె శనివారం మృతిచెందింది. విజేత మృతికి తుంగతుర్తిలోని సాయిబాలాజీ ఆస్పత్రి వైద్యుడే కారణమని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆమె మృతదేహం ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని తగిన న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. మృతురాలి భర్త భయగళ్ల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రుద్ర క్రాంతికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బంగారం చోరీ కేసులో ఇద్దరు దొంగల అరెస్టు

- నిందితుల నుంచి 554గ్రా. బంగారం, రూ.92,500 నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్: సూర్యాపేట పట్టణంలోని శ్రీసాయి సంతోషి జ్యూయలరీ షాపులో జూలై 21న రాత్రి జరిగిన భారీ దొంగతనం కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు. నిందితుల నుంచి రూ.60లక్షల విలువ గల 554 గ్రాముల బంగారం, రూ.92,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. సాంకేతిక ఆధారాలతో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం దక్షిణ్ దినాజ్‌పూర్ జిల్లా, బైహోర్ గ్రామానికి చెందిన ఏ–4 అయిన మాలిక్ మొల్లా అనే దొంగను ఈ నెల 11న సూర్యాపేట పోలీసులు అరెస్టు చేశారు. అలాగే నేపాల్‌కు చెందిన ఏ–6 నిందితుడు అమర్ భట్‌ను ఖమ్మం పట్టణంలో అదుపులోకి తీసుకుని అతని వద్ద రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏ–6 నిందితుడైన అమర్‌భట్ ఖమ్మంలో దొంగలకు ఆశ్రయం ఇవ్వడం, రెక్కీ చేసేందుకు సహాయం చేసినట్టు చెప్పారు. ఏ–4 నిందితుడైన మాలిక్ మొల్లాను పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తపన్ పోలీస్ స్టేషన్ పోలీసుల సహాయంతో అరెస్టు చేసి అతని వద్ద నుంచి సుమారు రూ.60 లక్షల విలువ గల 554 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.87,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని బలార్ ఘాట్‌లోని జిల్లా కోర్టులో న్యాయమూర్తి వద్ద నిందితుడిని ప్రవేశపెట్టి ఏడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతి తీసుకుని నిందితుల రాష్ట్రాల బదిలీ (ట్రాన్సిట్) నిబంధనల ప్రకారం సూర్యాపేటకు తీసుకొచ్చారు.

జూలై 27న మహిళ అరెస్టు, 14తులాలు స్వాధీనం

ఇదే కేసుతో సంబంధమున్న మహిళను జూలై 27న అరెస్టు చేసి ఆమె వద్ద 14 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ఆ మహిళను విచారించగా పలు విషయాలు వెల్లడించినట్టు చెప్పారు. అదేవిధంగా పట్టుబడిన మాలిక్ మొల్లాను విచారించగా నేపాల్‌కు చెందిన ఏ–1 ప్రకాశ్ అనిల్‌కుమార్, ఏ–2 కడక్‌సింగ్ అహల్‌వాలియ, ఏ–3 పురన్‌ప్రసాద్ జోషి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మల్దా జిల్లాకు చెందిన ఏ–5 జషిముద్దీన్‌తో కలిసి శ్రీసాయిసంతోషి జ్యూయలరీ షాపులో దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారని వెల్లడించారు.

అద్దెకు తీసుకున్న రూంలో బంగారం పంచుకొని పరార్..

దొంగతనానికి పాల్పడిన దొంగలు షాపు సమీపంలో తీసుకున్న అద్దె రూంలో 5 భాగాలుగా పంచుకుని దొంగతనానికి సహకరించిన ఏ–7 అయిన యశోద అనే మహిళకు, ఏ–6 అయిన అమర్ భట్‌లకు ఖర్చుల కోసం కొంత బంగారం, డబ్బులు ఇచ్చి అక్కడి నుంచి పరారయ్యారు. నేపాల్‌కు చెందిన ఏ–1 ప్రకాష్ అనిల్ కుమార్, ఏ–6 అమర్‌భట్‌లు ఇద్దరు ఖమ్మంలో గూర్ఖాగా పనిచేస్తూ వచ్చే సంపాదన సరిపోక దొంగతనాలు చేయాలని నిర్ణయించుకుని ఖమ్మంలో దొంగతనాలు చేసి కేసుల్లో జైలుకు సైతం వెళ్లి వచ్చారు.

మిగతా నిందితుల కోసం గాలింపు..

ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులు కాగా అందులో ముగ్గురిని అరెస్టు చేయగా మిగతా ఏ–1 ప్రకాష్ అనిల్‌కుమార్, ఏ–2 కడాక్ సింగ్, ఏ–3 పురన్‌ప్రజోషి, ఏ–5 జషిమొద్దీన్ నిందితుల కోసం పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో బాగా పనిచేసిన పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ నరసింహ అభినందించి రివార్డ్ అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్‌కు పర్యాటకుల తాకిడి



సాగర్ అందాలను ఫోన్‌లో బంధిస్తున్న పర్యాటకులు



సాగర్ సందర్శనకు వచ్చి కేరింతలు కొడుతున్న చిన్నారులు

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. కృష్ణాష్టమి సందర్భంగా శనివారం సెలవు కావడంతో సాగర్ అందాలను తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్పిల్ వే మీదుగా కిందకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ పరవళ్లను ఫొటోలు తీసుకుంటూ, సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు. పర్యాటకుల వాహనాలతో లాంచీ స్టేషన్ వద్ద, ఫైలాన్ కాలనీ మూడు రోడ్ల కూడలిలో, కొత్త వంతెన సమీపంలో ట్రాఫిక్ జాం అయ్యింది. ఆంధ్రప్రదేశ్ నుంచి 50 మంది, తెలంగాణ నుంచి 50 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ జాం కాకుండా చర్యలు తీసుకున్నారు.

నాగార్జునకొండలో పర్యాటకులను వదిలివచ్చిన లాంచీ స్టేషన్ సిబ్బంది

నాగార్జునకొండ సందర్శనకు శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు లాంచీలో వెళ్లిన పర్యాటకులను నాగార్జునకొండలోనే వదిలి.. లాంచీ ఎక్కిన వారిని తీసుకుని లాంచీ స్టేషన్‌కు తిరిగి వచ్చింది. దీంతో 30 మంది పర్యాటకులు నాగార్జునకొండ పైనే ఉండిపోయారు. అక్కడున్న పర్యాటకులు ఫోన్లు చేయడంతో తిరిగి లాంచీ వెళ్లి రాత్రి వేళ వారిని తీసుకుని వచ్చింది. లాంచీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కనీసం పర్యాటకులు అందరూ వచ్చారా లేదా అని చూసుకోకుండానే తిరిగి వస్తున్నారని పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



లాంచీ స్టేషన్ వద్ద కిటకిటలాడుతున్న పర్యాటకులు